సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



తప్పిన పెను ప్రమాదం

ఇబ్రహీంపట్నం–నాగార్జునసాగర్ వెళ్లే ప్రధాన రోడ్డులో గురువారం పెను ప్రమాదం తప్పింది.

8లో▸



పైసల పంచాయితీ

ఏ దిక్కూ లేని తనకు న్యాయం చేయాలని ఓ తండాకు చెందిన మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకోవడం కలకలం రేపింది.

8లో▸



బతుకులు చెల్లాచెదురు

పూడూరు గేట్ వద్ద గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు.

8లో▸

న్యూస్‌రీల్

పెంచిన వేతనాల కోసం అంగన్‌వాడీల నిరసన



ధర్నా చేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ యునియన్ నాయకులు

చేవెళ్ల: మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చినప్పటికీ వేతనాలు మాత్రం సమానంగా ఇవ్వడం లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు రాధ అన్నారు. ఈ మేరకు చేవెళ్లలో గురువారం సీడీపీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరిలో ప్రభుత్వం 4వేల మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ జీవో నంబర్ 4 విడుదల చేసిందని తెలిపారు. జనవరి, ఫిబ్రవరి, మే, జూన్ నెలలో మెయిన్ టీచర్లతో సమానంగా వేతనాలు చెల్లించారని.. మార్చి, ఏప్రిల్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పాత పద్ధతిలో చెల్లించారని చెప్పారు. ఈ విషయాన్ని యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు, మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్ల డేటా ఆర్థిక శాఖ ట్రెజరీ వద్ద అప్‌డేట్ కాలేదని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి మినీ అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు సరిగ్గా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాల మినీ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

20న సీఎం కప్–2024 టార్చ్‌రిలే

హుడాకాంప్లెక్స్: కర్మన్‌ఘాట్ టీకేఆర్ కమాన్ నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు ఈ నెల 20న సీఎం కప్–2024 టార్చ్ రిలే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఇ.వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రిలేలో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జిల్లా అధికారులు, ఒలింపిక్, క్రీడా సంఘాలు, క్రీడాకారులు, కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.204 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో నియోజకవర్గానికి మహర్దశ రానుందని చెప్పారు. పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో గురువారం పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన అందిస్తోందని అన్నారు. ఇటీవల కల్వకుర్తిలో జరిగిన జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణసభలో పాల్గొన్న సీఎం కల్వకుర్తికి వరాల జల్లు కురిపించారని, ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి, సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలనే తన స్వప్నం నెరవేరిందని కసిరెడ్డి పేర్కొన్నారు. వారం రోజుల్లో కల్వకుర్తి నుంచి వెల్దండ, ఆమనగల్లు మీదుగా మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరు అందిస్తామన్నారు. మిగిలిన అన్ని మండలాలకు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ సమీపంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఫిష్.. తుస్

చెరువుకు చేరని చేప

- సరఫరాకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- చేతులెత్తేసిన జిల్లా మత్స్యశాఖ
- ఈ ఏడాది విత్తన పంపిణీ లేనట్లే!
- ఆందోళనలో మత్స్యకారులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: చేపపిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. నిండుకుండలను తలపిస్తున్న చెరువులు, కుంటల్లో స్వేచ్ఛగా ఈదాల్సిన చేపపిల్ల.. ఇప్పటికీ చెరువు ఒడ్డుకు చేరలేదు. ఏళ్లుగా చేపలు పట్టడాన్నే జీవనోపాధిగా ఎంచుకుని జీవిస్తున్న మత్స్యకారుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. చెరువుల్లో విసిరిన వలకు చేపలు చిక్కక.. బయట ఉపాధి దొరకని దుస్థితి. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో వృత్తిదారులంతా రోడ్డున పడాల్సిన పరిస్థితి తలెత్తింది.

ముందుకు రాని సప్లయర్స్

మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2016–17లో ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఈ మేరకు జిల్లాలో 1,098 చెరువులను గుర్తించి, వీటిలో ఏడాది పొడవునా నీళ్లు ఉండే వాటిలో చేప పిల్లలను వదిలేది. దీనిలో భాగంగా గత ఏడాది 799 చెరువుల్లో 16.35 లక్షల చేపపిల్లలను వదలగా, 9,741 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. 186 మత్స్య పారిశ్రామిక సహకర సంఘాల్లో 9,136 మంది సభ్యులు ఉండగా, చేపలు పట్టడం ద్వారా వీరికి రూ.147.04 కోట్ల ఆదాయం సమకూరింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరాజయం పాలవడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, మత్స్య శాఖపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో టెండర్ల ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంది. సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు ఆయా చెరువులు, కుంటలన్నీ పూర్తిగా నిండి మత్తడి దూకుతుండటంతో మత్స్యశాఖ అప్రమత్తమైంది. ఏడాదంతా నీరుండే 400 చెరువుల్లో చేపపిల్లలను వదలాలని నిర్ణయించి, ఆ మేరకు రూ.93 లక్షల బడ్జెట్ కేటాయించింది. నిజానికి మార్చి, ఏప్రిల్ నెలల్లోనే చేపపిల్లల సరఫరా టెండర్ ప్రక్రియ ముగించాల్సి ఉంది. తీరా వర్షాలు కురిసి, చెరువులు మత్తడి దూకిన తర్వాత ప్రక్రియను మొదలు పెట్టడం, అర్హతగల కంపెనీలు టెండర్‌లో పాల్గొనకపోవడం, ఆయా కంపెనీల వద్ద డిమాండ్ మేరకు చేపపిల్లలు లేకపోవడంతో పంపిణీ ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది.

నిధులు నీళ్లపాలు

ప్రభుత్వం చేపపిల్లల కొనుగోలు కోసం ఏటా భారీగా నిధులు వెచ్చిస్తోంది. 35–40 ఎంఎం సైజులో ఉన్న ఒక్కో చేపపిల్లకు రూ.60 పైసల చొప్పున, 80–100 ఎంఎం చేపపిల్లకు రూ.1.20 చొప్పున చెల్లిస్తోంది. నాణ్యమైన చేపపిల్లలు కాకుండా నాసిరకం పిల్లలను పంపిణీ చేస్తున్నారనే ప్రచారం కూడా ఉంది. గత ఏడాది కొంతమంది మత్స్యకారులు ఇదే అంశాన్ని గుర్తించి, వచ్చిన చేపపిల్లలను వెనక్కి పంపిన దాఖలాలు కూడా ఉన్నాయి. నిజానికి చేపపిల్ల కేజీ బరువు పెరగాలంటే కనీసం ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు పడుతుంది. చెరువుల్లో కనీసం ఆరు ఫీట్లలోతు నీరు ఉండాల్సి ఉంది. వేసవికి ముందే మెజార్టీ చెరువులు, కుంటలు ఒట్టిపోతున్నాయి. తీరా ఆయా చేపపిల్లలు పావుకిలో నుంచి అర కిలో సైజు పెరిగే సమయానికి చెరువులోని నీరంతా ఖాళీ అవుతుండటం, కొంగలు, ఇతర పక్షులకు ఆహారంగా మారుతుండటం మత్స్యకారులకు నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చేపపిల్లల కోసం కేటాయించిన బడ్జెట్‌ను వృథా చేయడం కంటే..వాటిని మత్స్యసహకార సొసైటీల్లో జమ చేయడం ద్వారా వృత్తిదారులను ఆదుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎనిమిదేళ్లలో చేపపిల్లల పంపిణీ ఇలా..

సంవత్సరం	పంపిణీ చేసింది (లక్షల్లో)	బడ్జెట్ (లక్షల్లో)	ఉత్పత్తి (మెట్రిక్ టన్నుల్లో)	ఆదాయం (కోట్లలో)
2016–17	10.10	రూ.18.00	5,510	రూ.64.51
2017–18	99.74	రూ.63.10	8,100	రూ.103.20
2018–19	27.69	రూ.21.54	3,491	రూ.58.50
2019–20	70.54	రూ.33.06	4,199	రూ.40.06
2020–21	129.05	రూ.70.23	4,305	రూ.58.98
2021–22	163.13	రూ.117.19	6,875	రూ.102.62
2022–23	163.13	రూ.117.19	9,273	రూ.138.62
2023–24	162.35	రూ.114.60	9,741	రూ.147.04

సొసైటీ ఖాతాల్లో జమ చేయండి

'ఇప్పటికీ చేపపిల్లల పంపిణీ చేయలేదు. అక్టోబర్ పూర్తి కావస్తోంది. మూడు నాలుగు నెలల్లోనే చెరువులన్నీ ఖాళీ అయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో చేపపిల్లలను చెరువుల్లో వదలడం శ్రేయస్కరం కాదు. ఎదుగు బొదుగు లేకుండానే చనిపోయే ప్రమాదం ఉంది. నాసిరకం సీడ్ సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం వాటి కొనుగోలు కోసం కేటాయించిన బడ్జెట్‌ను మత్స్యశాఖ సొసైటీ ఖాతాల్లో జమ చేయడం ఉత్తమం. ఈ నిధుల ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించొచ్చు. మత్స్యకారుల ఇన్సూరెన్స్, నష్టపరిహారం వెంటనే చెల్లించాలి' అని తెలంగాణ మత్స్య కార్మిక సంఘం(టీఎంకేఎంకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, ఉపాధ్యక్షుడు పూలగాజుల జంగయ్య ఇటీవల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మత్స్యశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అర్హత ఉన్న కంపెనీలు రాలేదు

చేప పిల్లల ఉత్పత్తి, పంపిణీ కోసం ఔత్సాహిక కంపెనీల నుంచి టెండర్లు కోరాం. అర్హతగల వారు ముందుకు రాలేదు. వచ్చిన వాళ్ల వద్ద సరఫరా సామర్థ్యం లేదు. ఎవరైనా సరఫరా చేస్తే..కొనుగోలు చేసి చెరువుల్లో వదులుతాం.

– నర్సింహారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి



రోడ్డు ప్రమాదాలపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ శశాంక

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

- అన్నిశాఖలు సమన్వయంతో పని చేయాలి
- కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్లను గుర్తించి, వాటిని పూడ్చి వేయాలని సూచించారు. జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రత చర్యలు అత్యంత కీలకమైనవని, అన్ని శాఖల అధికారులు బ్లాక్ స్పాట్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి మండలంలో రహదారి భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరిగిన వెంటనే ఆయా ప్రాంతాలకు బృందాలు వెళ్లి ప్రమాదం ఎలా జరిగిందో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రోడ్డుకు సంబంధించిన ప్రతి జోన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కూడళ్లు, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. హైస్కూల్ నుంచి డిగ్రీ స్థాయి వరకు విద్యార్థులను ట్రాఫిక్ శిక్షణ కేంద్రాలకు తీసుకెళ్లి అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ, రహదారుల ఇంజనీరింగ్ సంస్థ అధికారులు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్, రాచకొండ డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్, డీఆర్‌ఓ సంగీత తదితరులు ఉన్నారు.

గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

గ్రూప్–1 పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. ఈ మేరకు ఆయన సీఎస్ శాంతకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో 8,008 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి 11 కేంద్రాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నట్లు వివరించారు. ఆ తర్వాత వచ్చిన వాళ్లను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



షాద్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వాటిని ఎత్తివేయాలని కోరుతూ గురువారం మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు యాదగిరితో కలిసి డీజీపీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి వెళ్లిన వారు డీజీపీ జితేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులను అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు.



నేదునూరు గేట్ వద్ద బండరాయితో మోదడంతో మృతి చెందిన వ్యక్తి (ఫైల్)



కొత్తగూడ సమీపంలోని ఫాంహౌస్‌లో హత్యకు గురైన వృద్ధుడు (ఫైల్)

హడలెత్తిస్తున్న హత్యలు

- వ్యవసాయ క్షేత్రాల్లో తరచూ ఘటనలు
- సవాలుగా తీసుకున్న పోలీసులు

కందుకూరు: వ్యవసాయ క్షేత్రాలంటేనే (ఫాంహౌస్‌లు) జనం జంకుతున్నారు. ఇటీవల ఫాంహౌస్‌లలో నివసించే వారినే టార్గెట్‌గా చేసుకుని దుండగులు హత్యలకు పాల్పడడం కలకలం సృష్టిస్తోంది. చంపిన వారి నుంచి ఏమీ ఆశించకపోవడం.. మృతుల ఒంటిపై ఆభరణాలు అలాగే ఉండటం.. వారు వివాదరహితులు, అమాయకులే కావడంతో కేసులు ఛేదించడం పోలీసులకు సవాలుగా మారింది. ఈ తరహా హత్యలకు ఎవరు పాల్పడుతున్నారనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. వరుస ఉదంతాల నేపథ్యంలో ఫాంహౌస్‌లపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ వ్యక్తం అవుతోంది.

కొన్ని ఘటనలు

- నెల్లూరు జిల్లా ఓజిలి మండలం మునమాలి గ్రామానికి చెందిన శైలజారెడ్డి(42), నరేందర్ రెడ్డి దంపతులు. కుమారుడు కృష్ణారెడ్డితో కలిసి కందుకూరు మండలం దాసర్లపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పదమూడేళ్లుగా ఉంటూ వ్యవసాయ పనులను పర్యవేక్షిస్తున్నారు. 2023, మార్చి 3న రాత్రి ఒంటరిగా ఉన్న శైలజారెడ్డిని వెనుక నుంచి కత్తితో దుండగుడు పొడిచి హత్య చేసి పరారయ్యాడు. ఇంత వరకు పోలీసులు హత్య చేసిన వారిని గుర్తించలేకపోయారు.
- 2021 అక్టోబర్ 9న రాత్రి మండల పరిధిలో శ్రీశైలం రహదారి పక్కన నేదునూరు గేట్ వద్ద బస్ స్టాప్‌లో నిద్రిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి తలపై బండరాయితో మోది హత్య చేశారు. ఈ ఘటనలో కూడా నిందితుడు ఎవరో తెలియలేదు.
- మంచాల పీఎస్ పరిధి ఆగాపల్లి వద్ద ఏడాదిన్నర క్రితం ఓ ఫాంహౌస్‌లోని వరండాలో నిద్రిస్తున్న వ్యక్తిని ఇదే తరహాలో హత్య చేశారు.
- మండలంలోని కొత్తగూడ సమీపంలో ఓ వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 15న రాత్రి సమయంలో అక్కడ నివసిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా ముష్టిపల్లికి చెందిన వృద్ధ దంపతులు శాంతమ్మ, హోసయ్యను అతికిరాతకంగా గొంతు కోసి హత్య చేశారు. ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.

ఎందుకు.. ఏం ఆశించి..

వ్యవసాయ క్షేత్రాల్లో హత్యకు గురైన వారికి ఎవరితో శత్రుత్వం లేకపోవడం, హత్య సమయంలో ఆభరణాలు అలాగే ఉండటంతో పోలీసులకు కేసు సవాలుగా మారింది. ఏమి ఆశించి ఇలాంటి హత్యలు చేస్తున్నారో తెలియడం లేదు. వరుసగా హత్యలు చేస్తున్న వ్యక్తి సైకోనా లేక సీరియల్ కిల్లరా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. నిందితుడు దొరికే వరకు ఈ ఉత్కంఠ కొనసాగనుంది.

ఇందిరమ్మ కమిటీలకు కసరత్తు

- పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న ప్రక్రియ
- కమిటీల్లో ఏడుగురికి స్థానం
- జాబితాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- కలెక్టర్‌కు తుది నివేదిక



ఇందిరమ్మ ఇల్లు నమూనా చిత్రం

షాద్‌నగర్/మహేశ్వరం: పేదల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఇళ్ల నిర్మాణ పథకానికి ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ వార్డుల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా దసర పండుగ నేపథ్యంలో కాస్త ఆలస్యమైంది. వీలైనంత త్వరగా కమిటీలను పూర్తి చేయాలనే సంకల్పంతో అధికారులు పని చేస్తున్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు క్రియాశీలక పాత్ర పోషించిన ఇందిరమ్మ కమిటీలు మళ్లీ తెరపైకి వచ్చాయి. రేవంత్ సర్కార్ ఎన్నికలకు ముందు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీలకైతే రూ.6లక్షల ఆర్థిక సాయాన్ని మూడు విడతలుగా అందజేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ఇందిరమ్మ ఇళ్లకు సైతం దరఖాస్తులు స్వీకరించారు.

పంచాయతీల్లో ఇలా..

గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏర్పాటు చేయనున్న కమిటీల్లో ఏడుగురికి స్థానం కల్పిస్తున్నారు. పంచాయతీల్లో సర్పంచ్ లేదంటే ప్రత్యేక అధికారి కమిటీకి చైర్మన్‌గా ఉంటారు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా కొనసాగుతారు. గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు సభ్యులుగా ఉంటారు. ముగ్గురు స్థానికులను కమిటీలో సభ్యులుగా తీసుకుంటారు. ఇందులో బీసీ వర్గాల నుంచి ఒకరికి, దళిత, గిరిజన వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పిస్తారు.

మున్సిపాలిటీల్లో అలా..

కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. కార్పొరేటర్ లేదంటే కౌన్సిలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వార్డు అధికారి కన్వీనర్‌గా కొనసాగుతారు. స్వయం సహాయ సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలకు, స్థానికుల కోటాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పిస్తున్నారు. గ్రామాల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు కమిటీల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు.

ఇదీ కమిటీల పని విధానం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ఎంపికైన కమిటీలు పథకంపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తాయి. జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తాయి. ఎంపికైన కమిటీలు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాలుగా పని చేస్తూ ఉన్నతాధికారులకు సంధానకర్తలుగా ఉండనున్నాయి.

తుది దశకు ప్రక్రియ

ఇందిరమ్మ కమిటీల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అన్ని పంచాయతీలతో పాటు, మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. కొన్ని గ్రామాల్లో కమిటీల ఏర్పాటులో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు సమాచారం. సమస్యలను అధిగమించి సజావుగా కమిటీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఏది ఏమైనా రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా కమిటీలను ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు. విద్యావంతులు, సామాజిక కార్యకర్తలను కమిటీల్లో చేర్చి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వీలైనంత త్వరగా జాబితాలు



ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇందిరమ్మ కమిటీలను సిద్ధం చేయాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులకు ఆదేశాలిచ్చాం. వీలైనంత త్వరగా కమిటీల జాబితాను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తాం. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తర్వాత కలెక్టర్ వద్దకు వెళ్లి కమిటీలకు ఆమోద ముద్రపడిన అనంతరం తుది ఎంపిక చేస్తారు.

– శ్రీలక్ష్మి, మహేశ్వరం నియోజకవర్గం ప్రత్యేకాధికారి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు


నర్సింహ (ఫైల్)

మహేశ్వరం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని అమీర్‌పేట్–గొల్లూరు మార్గంలో చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లూరు గ్రామానికి చెందిన కత్తుల నర్సింహ(30) అదే గ్రామానికి చెందిన మంద రాజు గురువారం సాయంత్రం ఆరు గంటలకు బైక్‌పై అమీర్‌పేట్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో అమీర్‌పేట్ నుంచి పులిమక్త వైపు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న నర్సింహకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెనుక కూర్చున్న రాజుకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి గాయాలైన రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ ట్రాలీకి రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో ముందుగా వెళ్తున్న వాహనం కనిపించకపోవడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ఐదుగురికి గాయాలు

యాచారం: వేగంగా వచ్చిన కారు ముందుగా వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా చందంపేట మండలం మురుపునూతల గ్రామానికి చెందిన తిరుపతయ్య కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఆటోలో ఇబ్రహీంపట్నం వైపు వస్తున్నారు. యాచారం మండలం గునగల్ క్రిడా వద్దకు రాగానే వెనకాల నుంచి కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తిరుపతయ్య, వెంటకమ్మ, విష్ణు, చంద్రకళ, సరితలకు గాయలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఇబ్రహీంపట్నంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి.. డ్రైవర్ దుర్మరణం

నాగోలు: ట్రాక్టర్ బోల్తాపడడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..హయత్ నగర్ పరిధిలోని తొర్రూర్‌కు చెందిన షేక్ మౌలానా(57) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అతను హస్తినాపురం వద్ద సెల్లార్ నిర్మాణంలో భాగంగా మట్టిని టాక్టర్ ద్వారా బయటికి తరలిస్తుండటంతో ట్రాక్టర్ టైర్లు స్లిప్ కావడంతో టాక్టర్ బోల్తా పడింది. షేక్ మౌలాన్‌పై ట్రాక్టర్ ఇంజిన్ పడడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడో అంతస్తు నుంచి పడి మహిళ మృతి

మీర్‌పేట: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి మహిళ మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. నందనవనం బ్లాక్ నం-34లో నివాసముండే సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి, లావణ్య(40)లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. లావణ్య ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తోంది. గురువారం ఆమె 3వ అంతస్తు బాల్కనీలోని మనీ ప్లాంట్ మొక్కను సరిచేసేందుకు ప్లాస్టిక్ కుర్చీ పైకి ఎక్కింది. ఈ క్రమంలో మొక్కను సరిచేస్తుండగా ఆమె ప్రమాదవశాత్తు బాల్కనీ నుంచి కింద పడింది. దీంతో తీవ్రంగా గాయడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి దుకాణాల్లో చోరీ

శంకర్‌పల్లి: పట్టణంలోని రెండు దుకాణాల్లో షెట్టర్ తాళాలు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చేవెళ్ల రోడ్డులో వైష్ణవి హార్డ్‌వేర్, సంగమేశ్వర ఎంటర్‌ప్రైజెస్ దుకాణాల్లో అర్ధరాత్రి దొంగలు పడ్డారు. షెట్టర్‌కి ఉన్న తాళాలని పగులగొట్టి హార్డ్‌వేర్ దుకాణంలో రూ.25వేలు, సంగమేశ్వర దుకాణంలో రూ.17వేల నగదును ఎత్తుకొని వెళ్లారు. గురువారం ఉదయం దుకాణానికి వచ్చిన యాజమానులు దొంగతనం జరిగినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


ఇబ్రహీంపట్నం: డివైడర్ పైకి ఎక్కిన సీఎన్‌జీ గ్యాస్ సిలిండర్ల వాహనం


మొయినాబాద్: బోల్తా పడిన కారు

అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టిన గ్యాస్ సిలిండర్ల వాహనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం–నాగార్జునసాగర్ వెళ్లే ప్రధాన రోడ్డులో గురువారం పెను ప్రమాదం తప్పింది. సీఎన్‌జీ గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వస్తున్న వాహనం అదుపుతప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి పైకి ఎక్కింది. వివరాలు ఇలా ఉన్నాయి. యదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ నుంచి మండల పరిధిలో ఖానాపూర్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకుకు సీఎన్‌జీ సిలిండర్ల లోడ్‌తో డీసీఎం వాహనం వస్తుంది. ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై ఆర్టీసీ డిపో దాటగానే వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. కొద్దిదూరం వెళ్లి వీధిలైట్ల స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. ఆ శబ్దానికి షాక్ తిన్న డ్రైవర్ యశ్వంత్ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. స్థానిక సివిల్, ట్రాఫిక్ పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

నుజ్జునుజ్జయిన కారు

మొయినాబాద్: కారు అదుపుతప్పి డివైడర్ మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని రాణే ఇంజన్‌వాల్స్ కంపెనీ సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్, అతని భార్య విమల, కూతురు నవ్యశ్రీతో కలిసి కారులో నగరం నుంచి వికారాబాద్ వెళ్లేందుకు గురువారం మధ్యాహ్నం బయలుదేరారు. మండల పరిధిలోని రాణే ఇంజన్ వాల్స్ కంపెనీ సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి డివైడర్ మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న విమల, నవ్యశ్రీకి గాయాలయ్యాయి. కారు నడుపుతున్న నవీన్‌కుమార్‌కు మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. రోడ్డుపై కారు బోల్తా పడి నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పీఎస్‌కు చేరిన పైసల లొల్లి

- ఠాణాలో ఒంటిపై కిరోసిన్ పోసుకున్న మహిళ
- పోలీసుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం


దేవీబాయిని అడ్డుకుంటున్న పోలీసులు

బషీరాబాద్: ఏ దిక్కూ లేని తనకు న్యాయం చేయాలని కోరుతూ మండల పరిధిలోని ఓ తండాకు చెందిన మహిళ గురువారం బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గిరిజన మహిళ దేవీబాయి భర్త ప్రమాదంలో చనిపోవడంతో కూలీనాలి చేసుకుని పిల్లలను పోషిస్తోంది. తండ్రి లేని బిడ్డకు మంచి సంబంధం చూడాలనే తపనతో కట్నకానుకలకు వెనకాడకుండా.. కష్టాలకు ఓర్చి పెద్ద కూతురు వివాహాన్ని ఘనంగా చేసింది. సీన్ కట్ చేస్తే.. నాలుగు నెలలు తిరగక ముందే కూతురు.. పక్క తండాకు చెందిన మరో యువకుడితో పారిపోయి, పెళ్లి చేసుకుంది. ఈ విషయమై అప్పట్లో మిస్సింగ్ కేసు సైతం నమోదైంది. రంగంలోకి దిగిన పోలీసులు యువతి, యువకుడిని పట్టుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం మూడు కుటుంబాల వారు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. పెళ్లి ఖర్చుల కింద తనకు రూ.11 లక్షలు చెల్లించాలని మొదటి పెళ్లికొడుకు డిమాండ్ చేయడంతో.. పెద్ద మనుషులు దీన్ని సమ్మతించారు. దీనికి తోడు ఖర్చులు భరించి వివాహం చేసిన దేవీబాయికి సైతం రూ.3 లక్షలు ఇవ్వాలని తీర్మానించారు. ఈ మొత్తాన్ని రెండో పెళ్లి కొడుకైన కంసాన్‌పల్లి తండాకు చెందిన వినోద్ చౌహాన్ చెల్లించాలని ఒప్పంద పత్రం రాసుకున్నారు. అందరి సమక్షంలో ఇందుకు ఒప్పుకొన్న సదరు యువకుడు, అతని కుటుంబ సభ్యులు అక్టోబర్ 27లోపు డబ్బులు చెల్లిస్తామని రాసిచ్చారు. ఇదిలా ఉండగా గడువు సమీపిస్తుండటంతో మొదటి పెళ్లి కొడుకు, అతని కుటుంబ సభ్యులు దేవీబాయి ఇంటికి వెళ్లి డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. ఒప్పందం ప్రకారం సమయానికి డబ్బు ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ముందు అంగీకరించిన వినోద్, అతని కుటుంబ సభ్యులు ప్రస్తుతం డబ్బులు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. దీంతో అంతా కలిసి గురువారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అయితే ఇది తమ పరిధిలోని వ్యవహారం కాదని, మీరే తేల్చుకోవాలని ఎస్ఐ గఫార్ వారికి సూచించారు. దీంతో మొదటి పెళ్లి కొడుకు తరఫున వారికి ఒప్పుకున్న రూ.11 లక్షలు తాను ఎక్కడి నుంచి తేవాలని ఆందోళన చెందిన దేవీబాయి వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. చివరకు ఒప్పుకొన్న డబ్బులు చెల్లించేందుకు వినోద్ చౌహాన్ కుటుంబం అంగీకరించడంతో వ్యవహారం సద్దుమణిగింది.


ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న దేవీబాయి

పంట నష్టం చేసిన వ్యక్తులకు రెండు నెలల జైలు

ఇబ్రహీంపట్నం రూరల్: వ్యవసాయ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి పంటనష్టం కల్గించిన వ్యక్తులకు రెండు నెలలు జైలుశిక్షా లేదా రూ.2,500 జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం అదనపు కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు వెల్లడించారు. ఈ విషయానికి సంబంధించి గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు తెలిపిన వివరాల మేరకు.. 2020లో కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన బందె ప్రతాప్‌రెడ్డి పొలంలోకి అదే గ్రామానికి చెందిన ఇరుగదిండ్ల పెద్ద ఈదయ్య, ఇరుగుదిండ్ల సత్తయ్యలు వెళ్లి పంటకు నష్టం చేశారు. దీనిపై ప్రతాప్‌రెడ్డి కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ కోర్టుకు సమర్పించిన వివరాలు పరిశీలించగా వాదోపవాదనల తర్వాత జడ్జి నిందితులకు రెండు నెలల శిక్షా విధించిందించినట్లు సీఐ తెలిపారు.

ఆటో నుంచి ఎగిరిపడి యువకుడి మృతి

చేవెళ్ల: ఆటోలో వెనకల కూర్చున్న వ్యక్తులు ఎగిరి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన పుట్ట శంకర్(19) నగరంలో చేపలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. నగరం చుట్టూ జరిగే సంతలో చేపలు అమ్మేందుకు నిత్యం ఆటోలో తిరుగుతుంటాడు. గురువారం చేవెళ్లలో సంత కావటంతో నగరం నుంచి చేపల అమ్మేందుకు ఆటోలో వస్తున్నారు. అయితే ఆటోలో వెనక భాగంలో శంకర్‌తోపాటు రాములు కూర్చున్నారు. మండలంలోని కేసారం సమీపంలోని మలుపు వద్దకు రాగానే వేగంగా ఉన్న ఆటో ఓ వైపు వంగడంతో వెనకల కూర్చున్న ఇద్దరు ఎగిరి కిందపడిపోయారు. రాములు దూరంగా పొదల్లో పడటంతో స్వల్పగాయలతో బయటపడ్డాడు. శంకర్ రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం అందించటంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: నిర్మానుష్య ప్రదేశంలో కుళ్లిన స్థితిలో ఓ మహిళా మృతదేహం లభ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గుల్ ప్రాంతంలోని దుర్గామాత దేవాలయం సమీపంలో ఓ మహిళ మృతదేహం కుళ్లిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వివరాలు ఆరా తీయగా.. పక్కనే ఉన్న ప్యారం విజయభారతి ఆశ్రమం పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండి భిక్షాటన చేసే మహిళగా గుర్తించారు. పది రోజుల క్రితం ఆమె అనారోగ్యానికి గురై ఆహారం తీసుకోవడం మానేసిందని తెలిపారు. భిక్షాటన చేసే మహిళ(55) మృతదేహంగా నిర్ధారణకు వచ్చారు. ఆమె పేరు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

పశువులకు గడ్డి కోస్తుండగా ఘటన


పాండునాయక్ (ఫైల్)

దుద్యాల్: పశువులకు గడ్డి కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రోటిబండతండాలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాండు నాయక్(61) పశువులకు మేత కోసేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ కింద ఉన్న విద్యుత్ తీగలను గమనించకుండా పచ్చి గడ్డిని కోస్తున్నాడు. ఈ క్రమంలో కొడవలి విద్యుత్ తీగలకు తాకడంతో షాక్ కొట్టి అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య సోనిబాయి, ఇద్దరు కూతుళ్లు, కుమారులు ఉన్నారు. మండలంలో ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీలో భాగంగా పాండునాయక్‌కు ఉన్న దాదాపు 5 ఎకరాల భూమి కోల్పోతున్నాడు. ఇదే విషయమై కొద్ది రోజులుగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఫార్మా ఏర్పాటు వ్యతిరేక పోరాటంలో అత్యంత చురుగ్గా పాల్గొన్నాడని స్థానికులు తెలిపారు.

రాహుల్‌గాంధీని కలిసిన ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు

శంషాబాద్: పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ గురువారం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ... పీడిత వర్గాలకు అన్యాయం జరగకుండా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా సర్కారుకు సూచించాలని కోరారు.

అర్ధరాత్రి అల్లరి మూక వీరంగం

- పెట్రోల్ బంక్‌లో హల్‌చల్
- సిబ్బందితో వాగ్వివాదం ఆపై క్యాషియర్‌పై దాడి

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కావేరి నగర్‌లో అల్లరి మూక వీరంగం సృష్టించింది. ఓ పెట్రోల్ బంక్‌లో హల్‌చల్ చేయడంతో పాటు క్యాషియర్‌పై మూకుమ్మడి దాడికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకా నగర్‌కు చెందిన సాయివర్ధన్ రెడ్డి కావేరినగర్ నాలా సమీపంలోని పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి శివసాయిగౌడ్ తన అనుచరులతో అక్కడికి వచ్చి ముత్యాలు అనే వ్యక్తికోసం ఆరా తీశాడు. ముత్యాలు రాలేదని సాయివర్ధన్ సమాధానం అని చెప్పడంతో మాకే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతావా అంటూ అతడిని దూషించాడు. దీంతో వాగ్వాతం చోటు చేసుకోవడంతో ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. దీంతో కన్నాగౌడ్ తన అనుచరులకు సమాచారం ఇవ్వడంతో దాదాపు 50 మందికి పైగా అక్కడికి వచ్చి సాయివర్ధన్‌పై మూకుమ్మడిగా దాడి చేయడమేగాక అర గంట పాటు బీభత్సం సృష్టించి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కన్నాగౌడ్, మల్లికార్జున్ గౌడ్, విక్రమ్ గౌడ్, సన్నిగౌడ్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బతుకులు చెల్లాచెదురు

- హైదరాబాద్– బీజాపూర్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్
- అక్కడికక్కడే ఇద్దరు, ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు దుర్మరణం
- మృతులందరూ సమీప బంధువులే
- మేడికొండ, గొంగుపల్లిలో తీరని విషాదం


ప్రవీణ్‌కుమార్(ఫైల్)


నవీన్‌కుమార్(ఫైల్)


హర్షకుమార్(ఫైల్)


ప్రమాద స్థలంలో చెల్లా చెదురుగా పడిన మృతదేహాలు

పూడూరు: పూడూరు గేట్ వద్ద గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటన రెండు గ్రామాల్లో తీరని విషాదం నింపింది. చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండ గ్రామానికి చెందిన చిలకమర్రి నవీన్‌కుమార్(21), బుడ్డమోళ్ల హర్షకుమార్(15), ఇదే మండలం గొంగుపల్లికి చెందిన మిట్టకంకటి ప్రవీణ్‌కుమార్(20) గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై మేడికొండ నుంచి మన్నెగూడకు బయలుదేరారు. వీరిలో హర్షకుమార్ అనంతగిరిపల్లి గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నవీన్‌కుమార్ వికారాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ ఆర్మీ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. వీరిద్దరూ దసరా సెలవుల సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు. హర్షకుమార్ బుధవారమే హాస్టల్‌కు వెళ్లాల్సి ఉండగా గ్రామంలో బంధువుల వివాహం ఉండడంతో వాయిదా వేసుకున్నాడు. వీరికి దగ్గరి బంధువైన ప్రవీణ్‌కుమార్ పెళ్లికి హాజరయ్యేందుకు బుధవారం మేడికొండకు వచ్చాడు. మరుసటి రోజైన గురువారం ఉదయాన్నే ప్రవీణ్ తన బైక్‌పై నవీన్‌కుమార్, హర్షకుమార్‌ను మన్నెగూడలో వదిలేసి గొంగుపల్లికి వెళ్తానని చెప్పాడు. దీంతో ముగ్గురూ ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. పూడూరు గేటు దాటుతుండగా ఎదురుగా వస్తున్న హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్, హర్షకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా ఆస్పత్రికి తరలిస్తుండగా నవీన్ మరణించాడు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టానికి పరిగి మార్చురీకి తరలించారు.

వ్యవసాయ కుటుంబాలే...

మృతుల ముగ్గురివీ రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలే. దసరా సెలవుల కోసం ఇంటికి వచ్చి, హాస్టల్‌కు వెళ్తున్న హర్షకుమార్, ఆర్మీ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో శిక్షణ తీసుకుంటున్న నవీన్, అమ్మమ్మవారి గ్రామంలో పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చిన ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం మూడు కుటుంబాలను పుట్టెడు శోకంలో ముంచింది. బయలుదేరిన పది నిమిషాల్లోనే ఫోన్ రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.